# రెండు గంగలు - by స్వర్గీయ శంకరమంచి సత్యం



"కథ చెప్పు తాతయ్యా" అని వేధిస్తున్నారు శాస్త్రి గారి మనమలు చుట్టూ చేరి.

"ఏం కథ చెప్పనురా?" అని ఆలోచిస్తున్నట్టు బోసి నోరు పిప్పి పైకి చూశాడు ఎనభై ఏళ్ళు పైబడుతున్న శాస్త్రి గారు.

"ఏదో వొకటి" అంటూ నిద్రకి ఓ పక్క ఆవులిస్తూ చేతులు పట్టుకు గుంజుతున్నారు పిల్లలు.

"సరే" అంటూ .. మొదలెట్టాడూ శాస్త్రిగారు. "ఒకరోజున.." ఊ కొడ్తున్న చిన్న పిల్లలతో పాటు పట్నం కాలేజీలో చదువుతున్న శాస్త్రి గారి పెద్ద మనవడు కూడా చదువుతున్న పుస్తకం మూసి వింటున్నాడు.

"చాలా సంవత్సరాల క్రితం.. నాకు పెళ్ళయిన కొత్తల్లో.."

"అంటే నేను పుట్టిన తర్వాతేనా?" అన్నాడు ఆఖరి మనవడు.

"ఇహ్" అని నోరంతా పిప్పి నవ్వి వాణ్ణి వొళ్ళోకి తీసుకుని మళ్ళీ మొదలెట్టాడు శాస్త్రిగారు.

"పెద్దింటమ్మ గుడి దగ్గర చేనికెళ్ళి వస్తున్నాను. అటూ ఇటూ పొలాలు, కనుచూపుమేర భూమంతా పచ్చటి కంబళీ పరిచినట్టుంది. నేలతల్లి చిలకాకుపచ్చ చీర వొళ్ళంతా చుట్టుకున్నట్టు పొలాలు. పొలం చుట్టూ తిరిగి, గట్ల పక్కన కుంటలో కాసిన్నీళ్ళు తాగి అట్లా డొంకలో కొచ్చాను. మాపిళ్ళ చేను దాటానో లేదో చిటపట చినుకులు ప్రారంభమైనాయి. తలెత్తి పైకి చూస్తే సూర్యుడెక్కడికో పారిపోయాడు. నల్ల మేఘాలు గుంపులు గుంపులుగా పరుగెత్తుతున్నాయి. ఆకాశమంతా నల్ల మేఘాలే. నల్ల చీర కట్టుకున్న ఆడదాని మెళ్లో బాకులాగా ఆ నల్ల మేఘాల మధ్య ఓ మెరుపు, తూర్పు వైకుంఠపురం కొండమీద ఓ గర్జింపు - వాన పెద్దదైంది.

వలవల కురుస్తోంది వాన!
జలజల కురుస్తోంది వాన!

నేను గొడుగు తెచ్చుకోకపోతిని. పూర్తిగా తడిసిపోయాను. అయినా గొడుగులూ గోనె గుడ్డలూ ఏపిటి? అల్లంత ఆకాశగంగ పనిగట్టుకొచ్చి ఈ నేల తల్లిని చల్లగా కౌగలించుకుంటుంటే - ఈ మనిషన్నవాడెవడు గొడుగడ్డం పెట్టుకోటానికి?

ఉన్నట్టుండి మబ్బులు పెద్దపెట్టున ఉరిమాయి. వర్షరాణి తీవ్రవేగంతో రథం నడిపిస్తుంటే రయ్యిన పరుగెత్తే రథ చక్రాల ధ్వని లా ఉంది ఆ ఉరుము. ఆ ఉరుము అలా దూరమవుతూంటే అదిలించినప్పుడు ఆ రథానికి పూన్చిన గుర్రం సకిలింపులా ఉంది. అల్లంతలో మబ్బుల్లో గొప్ప మెరుపు. అది వర్షరాణీ కిరీటంలా ఉంది. కిరీటమే కళ్ళు మిరుమిట్లు గొల్పితే ఆ రాణి ఎలా ఉంటుందో అలంకారాలు చూడ్డానికే ఈ కళ్ళు ముసుకుపోతుంటే ఇంక ఆకారాలెలా కన్పిస్తాయి?

డొంకలో బురద బురదయిపోయి కాలు సాగటంలేదు. చెప్పులు పిడిచి చేతపట్టాను. "వరెవరె!

అప్పుడనిపించిందిరా! గంగమ్మ ఈ భూమినంతటినీ చల్లబరుస్తుంటే, నేనూ చల్లబడక ఈ పాత చెప్పు లడ్డం పెట్టుకున్నానా" అని. ఇప్పుడు వర్షం నా మీద కురుస్తోంది. నాలోంచి కురుస్తోంది. జల్లు జల్లు గా కురుస్తోంది. భళ్ళుభళ్ళున కురుస్తోంది. వర్షపు చల్లదనం శిరస్సునుంచి పాదాలదాక పాకి శరీరంలోని సర్వాణువుల్ని కడిగేస్తోంది. ఆ చల్లదనం నరనరాల్లోంచి పరుగులెత్తి పెచ్చుగా ఉంది. అది ఎన్ని స్నానాలపెట్టు! ఎన్ని మునకలు దానికి దీటు! వర్షమంతా నా మీదే పడాలనిపించింది. నన్ను ముంచెయ్యాలనిపించింది. ఆ సమయం లో నేను నడవటం మానేసి, వొరేయ్! ఆ డొంక మధ్య లో సిటారుగా నుంచున్నారా!

అటుపక్క చూస్తే పొలాల మీద వాన. మంచి శనగ చేను మీద వాన పడుతుంటే పైరు పైరంతా ఆనందంగా వూగుతోంది. ధనియాల చేను మీద వాన పడుతుంటే ఆ మేరంతా కొత్తిమెర వాసన, వాన సుగంధం కలిసిపోయిన గాలి. వానకి జొన్నచేను నృత్యం చేస్తోంది. మొక్కజొన్న కండెలుబ్బి పోతున్నాయి. సజ్జ కంకులు పొంగుతున్నాయి. వరి ఉన్నట్టుండి పెరుగుతోంది. కందికాయలు, పిల్లిపెసర్లు కువకువ లాడుతున్నాయి. పేరుశనగ చేను పిచ్చుకుని వేళ్ళలోకి దింపుకుంటోంది వర్షధారల్ని. అలా నేలనేలంతా, పైరు పైరంతా వర్షానికి పరిపరిపిధాలుగా పులకలెత్తుతోంది. పొలాల మీద వాన కొంచెం తగ్గుముఖం పటినట్లనిపించింది. కుడిపక్కకి తిరిగిచూస్తే కృష్ణ మీద వర్షం జోరుగా ఉందనిపించి కృష్ణ వొడ్డుకు బయల్దేరాను. అలా ఎందుకనిపించిందీ అని అడక్కు. రంగావఝులవారి చేనుదాటి అలా కృష్ణ వొడ్డుకి వస్తిని గదా -

వరె వరె వరె! అదీ వర్షం.

అంత గొప్ప ప్రవాహం లో సంతత ధారగా వానపడిపోతోంది. నీళ్ళలో నీళ్ళు! ధారలో ధార! ప్రవాహం లో ప్రవాహం! వాన చినుకులు కృష్ణలో పడుతుంటే పెద్దక్క ప్రేమగా వొత్తుకుంటే వొళ్ళు జలదరించినట్టు, ఆ ప్రవాహం మీద ఓ జలదరింపు, ఓ పులకరింపు. సిగ్గుతో నవ్వినప్పుడు బుగ్గ మీద సొట్టలా చినుకు పడ్డచోట చిన్నగుంట. అంతలో ఆ గుంట మాయం. మళ్ళీ చినుకు మళ్ళీ గుంట. మళ్ళీ మళ్ళీ చినుకులు. అంతలో మాయమయి మళ్ళీ మళ్ళీ గుంటలు. కృష్ణంతా చినుకులు. కృష్ణంతా పులకరింతలు. ఇసక మీద చినుకులు. కసకస చినుకులు. రేణు రేణువుకీ చినుకులు. పిసపిస, సరసర చినుకులు. రివ్వుమని, రయ్యిమని చినుకులు, ఊపులా చినుకులు. తాపులా చినుకులు. చళ్ళుమని, ఫెళ్ళుమని, దభిల్లుమని, పెఠిల్లుమని చినుకులు .. చినుకుల్లు .. కృష్ణసిండా, ఇసక సిండా, నేలసిండా .. చినుకుల్లు చినుకులు .. రెండు గంగలు కలిసిపోయినట్టు, సింగీ నేలా ఒకటే అన్నట్టు. ఈ జగత్తులో నీళ్ళు తప్ప ఇంకేపే లేనట్టు, అన్నిటికీ నీళ్ళే ఆధారమన్నట్టు వాన, వర్షం, గంగమ్మ, కిష్టమ్మ, సంద్రం .. అదేదో దానికి నువ్వే పేరైనా పెట్టుకో.

అలా ఆ అఖండ జల ప్రపంచం మధ్య మతిపోయి నుంచున్నానా .. పడవ్వాళ్ళు నలుగురైదుగురు వచ్చి "శాస్తుల్లుగారు ఈడున్నారేటి?" అన్నారు. అప్పుడీ లోకంలో పడి .. నేనిక్కడే ఉంటానంటే "ఇదేవన్నా మతిభ్రమణవేమో" అనుకుంటారేమోనని వాళ్ళవెంట వూళ్ళో కొచ్చాను.

"వర్షం ఆగిపోయిందని చెప్పకు తాతయ్యా" అన్నడు కాలేజీ లో చదువుతున్న మనవడు. అప్పటికి మిగతా మనవలు నిద్రపోయారు.

"లేదురా ఇంకా కురుస్తోంది. ఆగకుండా కురుస్తోంది. ఇల్లు దగ్గర పడుతున్నకొద్దీ

కంగారెక్కువయింది. మీ నాయనమ్మా, కొత్తగా కాపరానికొచ్చిన చిన్నపిల్లయ్యో! అందులో పట్నంలో కచ్చేరీ గుమాస్తాగారి కూతురేమో, వర్షంలో తడిసి జలుబుచేసి ఎక్కడ ముక్కూడగొట్టుకుంటుందో అని గబగబ నడిచాను. ఇంట్లోకొస్తే ముందు వరండాలో లేదు. మధ్య గదిలో లేదు. వంటింట్లో లేదు. "ఓహోయ్!" అని కేకేస్తే బదులు లేదు. గబగబా దొడ్లోకొస్తే దొడ్డి చివర ఆరుబయట కృష్ణవైపు తిరిగి నుంచుని కన్పించింది. వర్షం కృష్ణలో కలుస్తుంటే, కృష్ణ వర్షంలో కలుస్తుంటే, వర్షంలో తను కలిసిపోయి, చేతులు పిప్పార్చి తల ములకలుగా హాయిగా తడుస్తోంది.

---

ఈ కథలని ప్రచురించటానికి మాకు అనుమతి ఇచ్చిన శ్రీ శంకరమంచి సత్యం గారి కుమారుడు శ్రీ శంకరమంచి రవిశంకర్ గారికీ, ఈ ప్రయత్నంలో మాకు సహకరించిన శ్రీ JUBV ప్రసాద్ గారికీ మా కృతజ్ఞతలు.